క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పుస్తకపఠనం నిమగ్నమైన విద్యార్థులు

భీమవరం: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం ఉపాధ్యాయుడు జె.గంగాధర్ విద్యార్థులకు నీతి కథలు చెప్పగా జె శ్యామ్ విద్యార్థులకు నృత్య శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వేసవి శిక్షణలో పట్టణంలోని వివిధ పాఠశాలలో విద్యార్థులు పాల్గొంటున్నారని వీరికి వివిధ అంశాలపై జూన్ 7 వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వి.సోమరాజు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: గోవిందమాంబ సమేత వీర బ్రహ్మేంద్ర స్వామి వార్ల కల్యాణోత్సవం స్థానిక సంత మార్కెట్ వద్ద ఉన్న ఆలయంలో శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లను, అమ్మవారిని పెండ్లి కుమారుడు, కుమార్తెగా అలంకరించారు. అనంతరం భక్తుల సమక్షంలో కల్యాణ తంతు జరిపించారు. కల్యాణ పీటలపై కొప్పర్తి మణికంఠ మంగరాజు, తనూజ దంపతులు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా, పట్టణ, అధ్యక్షులు పట్నాల శేషగిరిరావు, పట్నాల రామకృష్ణ, తామరపల్లి సత్య శ్రీనివాస్, పెదగాడి కృష్ణ, గెడ్డం నాగేశ్వరరావు, పట్నాల భసవాచార్యులు తదితరులు పాల్గొన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

ఉండి: ఇజ్రాయేల్ దేశానికి పంపిస్తానని ఓ వ్యక్తి డబ్బు తీసుకుని మోసగించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం గ్రామానికి చెందిన జిల్లెళ్ళ ఇజ్రాయేలు అనే వ్యక్తి గల్ఫ్ దేశానికి వెళ్లి 2016లో తిరిగి వచ్చాడు. అనంతరం మరోదేశానికి వెళ్లేందుకు అతను ప్రయత్నించే కార్యక్రమంలో భాగంగా తెలంగాణా రాష్ట్రం నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆర్మూర్‌కు చెందిన జంబరాతి సురేష్ అనే వ్యక్తిని కలిశారు. అతను ఇశ్రాయేల్ దేశం పంపిస్తానని అందుకు రూ.11 లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో అతనితో అన్ని మాట్లాడుకుని ఇశ్రాయేల్ దేశం వెళ్లేందుకు అతనికి రెండేళ్ల క్రితం రూ.6 లక్షలు నగదు చెల్లించాడు. అనంతరం 2023 జనవరిలో మరో రూ.5 లక్షలు అతని బ్యాంకు ఖాతా నుంచి చెల్లించాడు.అప్పటి నుండి ముఖం చాటేసిన సురేష్ ఇదిగో, అదిగో అంటూ కాలక్షేపం చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై ఎం లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫలిస్తున్న ప్రభుత్వ విద్యా విధానం

- ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుతంగా ఇంగ్లిష మీడియం
- 550 మార్కులతో కాలరెగరుస్తున్న ప్రభుత్వ విద్యార్థులు

ఉండి: మాటలే కాదు చేతల్లో కూడా ప్రభుత్వ ముందుందని చెప్పేందుకు మరో ఉదాహరణ ప్రభుత్వ విద్యా విధానం. అందులో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ప్రవేశపెట్టిన ఇంగ్లిషు మీడియం చదులు. ప్రజల మెప్పుకోసం ప్రచార ఆర్భాటాల కోసం కాకుండా నిరుపేదలను అందలం ఎక్కించాలంటే, వారిని అభివృద్ధిలోకి నడిపించాలంటే ఒకే ఒక్కమార్గం చదువు అని గుర్తించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారికి చదువు ఇంగ్లిషు మీడియంలో సాగాలని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియాన్ని ప్రవేశపెట్టారు. ఓ పక్క ప్రతిపక్షాలతో పాటు పేదవాడి ఎదుగులను చూసి ఓర్వని ఓ వర్గానికి చెందిన మీడియా ఎంతగా అడ్డుపడుతున్నా లెక్కచేయకుండా, ఎవరెన్ని అన్నా పట్టించుకోకుండా పేదల విద్యకు పెద్దపీట వేశారు



కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఉన్న మహదేవపట్నం హైస్కూల్ భవనం

ప్రైవేట్‌కు దీటుగా మార్కులు

ఇంగ్లిషు మీడియం చదవులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. అతి సులభంగా 575 మార్కులు సాధిస్తున్నారు. లక్షలు, వేలు ఫీజులు కడుతున్న ప్రైవేటు స్కూల్స్‌లో అతి కొద్ది మందికి మాత్రమే సాధ్యమవుతున్న 550 మార్కులను ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సులభంగా సాధించడంతో ఇప్పుడు అందరి చూపు ప్రభుత్వ పాఠశాలల్లోని ఇంగ్లిషు మీడియం చదవులపై పడింది. ప్రైవేటు స్కూల్స్ నుండి ప్రభుత్వ పాఠశాల్లో తమ బిడ్డలను చేర్చేందుకు ఎంతో మంది తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. అలాగే ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసేలా డిజిటల్ వైపు అడుగులు వేయడంతో ప్రభుత్వ పాఠశాలలు అనేక మందిని ఆకర్షిస్తున్నాయి. ప్రతీరోజు డిజిటల్ పాఠాలు, 8వ తరగతి నుంచి ట్యాబ్ ఇవ్వడంతో ప్రపంచ పరిజ్ఞానాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పొందుతున్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచస్థాయి పరిజ్ఞానం కలిగిన టోఫెల్ పరీక్షలు నిర్వహించి ఇంగ్లిషు భాషపై మరింత లోతైన పట్టు సాధించేందుకు కృషి చేస్తున్నారు. దీంతో త్వరలోనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు భవితవ్యం మారనుందని విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు.

పేదల పాలిట వరం



ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లిషు మీడియంతో ఎంతో మంది పిల్లలు అద్భుతంగా రాణిస్తున్నారు. వేలు, లక్షలు ఫీజులు కట్టి ప్రభుత్వ పాఠశాలల్లో అదే చదవు చదువుతున్నారు. పేదలపాలిట వరంగా ఇంగ్లిషు మీడియం ఉచిత చదువులు నిలుస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంతో సహా అన్నింటినీ ఉచితంగా విద్యార్థులకు అందిస్తున్నారు.

బి.జ్యోతి,
మండల విద్యాశాఖాధికారి-1.ఉండి

ఇంగ్లిషు మీడియం అద్భుతంగా ఉంది



ప్రభుత్వ పాఠశాలపై చిన్న చూపు ఉంది. కానీ ఇప్పుడు ప్రభుత్వ పాఠశాల్లో ప్రవేశపెట్టిన ఇంగ్లిషు మీడియం ప్రైవేటు,కార్పొరేట్ పాఠశాలల్ని తలదన్నేలా ఉంది. గతంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాస్ కావడమే గొప్ప అనుకునేవారు. కానీ ఇప్పుడు 600 మార్కుల టార్గెట్‌గా చేసుకున్నారు. నాకు పదో తరగతిలో 575 మార్కులు వచ్చాయి.

– డి.రమ్య, యండగండి

మాకు ఓ వరం



ప్రైవేటు పాఠశాల్లో చేరి చదవుకునే స్తోమత మాకు లేదు. కానీ ప్రైవేటు పాఠశాల్లో ఎంతో మంది విద్యార్థులకంటే ఇప్పుడు మేమేం తక్కువకాదు. ఇంగ్లిషు మీడియంతో మా జీవితాలు మారిపోయాయి.ఇప్పుడు మేము ఎందులోను తీసిపోం.ప్రతి సబ్జెక్టులోను నూటికి నూరుశాతం మార్కులు సాధించాలనే తపనతో చదివారం. నాకు పదో తరగతిలో 573 మార్కులు వచ్చాయి.

– బి.సుభాషిణి, యండగండి

ఏదైనా సాధిస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న మాకందరికీ ఇప్పుడు చాలా ధైర్యంగా ఉంది.మా పెద్దవాళ్ళు చెప్పువారు గతంలో ప్రభుత్వ పాఠశాలలో చదవే వారంటే చాలా చులకనగా చూసేవారని ఇప్పుడు కార్పొరేట్‌కు దీటుగా మేమంతా ఇంగ్లిషు మీడియం చదవుల్లో ఎన్నో నేర్చుకున్నాం. ప్రపంచంతో పోటీ పడగలం అనే ధైర్యం,నమ్మకం మాకుంది. నాకు పదో తరగతిలో 569 మార్కులు వచ్చాయి.

– జి.గణేష్, యండగండి

రొయ్యల చెరువులతో ఇబ్బందులు



మొగల్లు అరుంధతీ కాలనీలో ముంపు బారిన ఇళ్లు

పాలకోడేరు: రొయ్యల చెరువుల వల్ల మా ఇళ్లన్నీ మునిగి పోతున్నాయని మొగల్లులోని అరుంధతి కాలనీ, జగనన్న కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిఏటా ఆ చెరువుల్లోని వ్యర్థపు నీరు బయటకు వదిలేస్తున్నారని దాని వల్ల కాలనీ మొత్తం మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. స్థానిక పంచాయతీ అధికారులు మా సమస్యపై దృష్టి పెట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వివాహితపై అసభ్య ప్రవర్తన

ఉండి: మండలంలోని యండగండి గ్రామానికి చెందిన ఓ వివాహితపై ఓ వ్యక్తి సభ్యంగా ప్రవర్తించడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 10న రాత్రి ఏడు గంటల సమయంలో వివాహిత ఇంట్లో ఉన్న సమయంలో గణపవరం మండలం చిలకంపాడు గ్రామానికి చెందిన గొట్టం ధనరాజు అనే వ్యక్తి ఇంట్లోకి చొరబడి తన కోరిక తీర్చాలని వివాహితపై అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ మేరకు బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు.

గుమ్ములూరు సెంటర్‌లో పోలీసుల కవాతు

ఆకివీడు: ఎన్నికల అనంతరం కూడా ఎన్నికల కోడ్ అమలులో ఉందని, సెక్షన్ 144 సీఆర్‌పీసీ, సెక్షన్ 30 పోలీస్ యాక్టులు అమల్లో ఉన్నాయని ఎస్సై బి.నాగబాబు చెప్పారు. శాంతి భద్రతలు పరిరక్షించేందుకు ప్రత్యేక పోలీస్ దళంతో శనివారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థుల్ని రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, తప్పుడు సమాచారం ఇవ్వడం నేరం, రెచ్చగొట్టేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, గుమ్మిగూడటం, ర్యాలీలు నిర్వహించవద్దని తెలిపారు. సివిల్ తగాదాలను అడ్డుపెట్టుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం షాపుల వద్ద మద్యం సేవించడం నేరమన్నారు. డిజే సౌండ్లు, సైలెన్సర్లు తీసి బండి నడిపే వారి వాహనాల్ని స్వాధీనం చేసుకుని, కేసులు పెడతామని స్పష్టం చేశారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బాటిల్‌లో పెట్రోల్ నిషేధం

పెట్రోల్ బంకుల వద్ద బాటిల్‌లో పెట్రోల్ పోయవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసిందని ఎస్‌ఐ నాగబాబు చెప్పారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకూ వాహనాల్లోనే పెట్రోల్ నింపాలని సూచించారన్నారు. నిబంధనల్ని పాటించకపోతే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరిస్తూ ఈసీ నోటీసులు జారీ చేసినట్లు ఎస్సై తెలిపారు. హింసాత్మక ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో ఈసీ ఆంక్షలు విధించినట్లు చెప్పారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు, అమ్మవార్లు



వేదమంత్రాలతో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలోని స్వయంభూః వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా శనివారం ఉదయం స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి వారు అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. వేద పండితులు తులసిదళములతో స్వామి, అమ్మవార్లకి విశేషార్చన చేశారు. సాయంత్రం స్వామివారికి ఎదుర్కోలు సన్నాహం(రాయబారోత్సవం) నిర్వహించారు. కల్యాణ మహోత్సవాలు సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ పర్యవేక్షించారు.

భీమవరం సబ్‌జైలు పరిశీలన

భీమవరం: స్థానిక సబ్ జైలును మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎ.సురేష్‌బాబు సందర్శించారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలు, వంటశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం జడ్జి సురేష్‌బాబు ముద్దాయిలతో నేరుగా మాట్లాడి వారి కేసు వివరాలను అడిగి తెలుసుకుని నేర ప్రవృత్తిని విడనాడాలన్నారు. కేసులకు సంబంధించి న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమతలేని ముద్దాయిలకు మండల న్యాయ సేవా సంస్థ తరపున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని ప్రతి శనివారం ఉచిత న్యాయవాది, వలంటీర్లు జైలును సందర్శిస్తారని వారి సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉచిత న్యాయవాదులు బేతపూడి లోకేశ్వరరావు, ఎంటీ భవాని, పారా లీగల్ వలంటీర్ కె.కామేశ్వరి, జైలు సూపరెంటెండెంట్ వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.



భీమవరం సబ్‌జైలును పరిశీలిస్తున్న జడ్జి సురేష్‌బాబు

నాలుగో రోజుకు చేరిన అతిరాత్ర మహాయాగం



అతిరాత్ర మహాయాగం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల వారి క్రీడామైదానంలో నిర్వహిస్తున్న అతిరాత్ర మహాయాగం శనివారం నాలుగో రోజుకు చేరుకుంది. ప్రవర్గ్యపసత్ , సుబ్రహ్మణ్య ఆహ్వానం, వేదికరణం, తృతీయచితి, ఉపదానము వేదోక్తంగా , సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తజన సందోహం మధ్య యాగం అత్యద్భుతంగా సుమారు ఆరు గంటల పాటు సాగింది. జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుబ్బారావు జ్యోతి వెలిగించి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి యాగాలు జరుగుతున్నప్పుడే ప్రపంచం శాంతిపథంలో నడుస్తుందని దేవాదాయశాఖ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. యజ్ఞకర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ యజ్ఞం వేరు యాగం వేరని యజ్ఞ యాగాలు ఇప్పటివి కావని పురాణ కాలం నుంచి ఈ యజ్ఞాలను నిర్వహిస్తూ వచ్చారని అన్నారు. ఎక్కడ యజ్ఞం జరిగిందో? ఆ ప్రాంతాలన్నీ కూడా శాంతి పథంలో సుభిక్షంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మహా మహోపాధ్యాయ డాక్టర్ దోర్బల ప్రభాకర్ శర్మ ప్రవచనం అందరినీ ఆకట్టుకుంది.

నాటికలతో సమాజంలో చైతన్యం



నాటక కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: నాటికలతో సమాజంలో చైతన్యం తీసుకురావచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. కళారంజని 13వ వార్షికోత్సవ జాతీయ స్థాయి తెలుగు నాటిక పోటీలు శనివారం భీమవరంలోని సోమేశ్వర జనార్ధన స్వామివార్ల ఆలయ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. సమాజంలో మార్పు తేవడానికి నాటకాలే ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. ఈ సందర్భంగా నాటక కళాకారులు కావూరి సత్యనారాయణకు ఎస్వీ రంగారావు స్మారక పురస్కారం, కోనేటి సుబ్బరాజుకు యశోభూషణ అవార్డును, ఎస్.డేవిడ్ రాజుకు జవ్వాది సూర్యారావు స్మారక పురస్కారం, బాలగోపాల త్రినాథరాజుకు చుక్కన శ్రీ పురస్కారం అందించారు. జె.దాశరథి శ్రీనివాస్, గుండా రామకృష్ణ, నల్లం నాగేశ్వరరావు పాల్గొన్నారు.